

# విరిగిన పల్లకి

ఊళ్ళో ఎక్కడో పెళ్ళి బాజాలు మోగుతున్నాయి.

రెండురోజులనుంచి వొంటిపూట గంజి తాగుతూ, నీరసంగా గోడకానుకుని కళ్ళు మూసుకుని పడుకున్న సంగడు ఉలిక్కిపడి లేచాడు.

మళ్ళీ దూరంగా సన్నాయిమోత. రండోల్ మోత. "పెళ్ళే! పెళ్ళి జరుగుతంది.! .... " సంబరంగా లేచి నుంచున్నాడు ఎదురుగుండా మాసి చివికిపోయిన పెళ్ళి పల్లకీవైపు చూశాడు. దిగాలుగా మోడులా వుంది పెళ్ళి పల్లకీ. నలభై ఏళ్ళయి ఆ పల్లకీని ఎవరూ వాడడం లేదు. పల్లకీకి చుట్టిన పీలికలు మాసిపోయి ఎండకు ఎండి వానకు తడిసి నల్లగా వికృతంగా వున్నాయి.

మళ్ళీ దూరంగా పెళ్ళి బాజాలు.

సంగడు పల్లకీ దగ్గరకు వెళ్ళి బొంగు నిమిరి "మాసిపోతేనేం! సాపుచేసి కుచ్చులు కడితే గుర్రంలా ఉండదో" అనుకుంటూ పొంగిపోతున్నాడు.

ఇంతలో అడుక్కోడానికెళ్ళిన, నడ్డి వంగిపోయిన సంగడి పెళ్ళాం సుబ్బి ఖాళీ బొచ్చెతో వచ్చింది. "నీకెప్పుడూ పల్లకీ పిచ్చే" అని దెప్పుతుందని, పల్లకీ విడిచిపెట్టి ముందుకొచ్చి "ఏమే! గంజి దొరకలేదా?" అన్నాడు. ఖాళీ బొచ్చె నేలను పడేసి "లేదురా మావా" అంటూ చతికిలబడింది.

దూరంగా పెళ్ళి సన్నాయి.

"పెళ్ళవుతున్నట్టున్నది. ఎళ్ళొద్దావంటె?" అన్నాడు సంగడు. "ఆళ్ళు భోజనాలయిన తర్వాతగాని ముద్దెయ్యరు గదయ్యా. మనకి సందేళే మింగమెతుకు"

వాళ్ళిద్దరికీ మెతుకు సంగతి సరేసరి రెండు రోజులనుంచీ ఒంటిపూట గంజే. సంగడు పాత పల్లకీవైపు ఆశగా చూశాడు. "ఉండవే నే యెళ్లొస్తా" అంటూ లేని ఓపిక తెచ్చుకుని హుషారుగా వీధిలోకొచ్చాడు.

దూరంగా పెళ్ళి సన్నాయి.

ఆ సన్నాయి మోత వింటూంటే సంగడిలో ఎంత ఉత్తేజమో! పెళ్ళి సంబరంతో ముందుకు నడిచాడు. ఠీవిగా పెళ్ళిపెద్దలా అడుగులు వేశాడు.

తను ఎన్ని పెళ్ళిళ్ళు చూశాడు కాదు! యాభై ఏళ్ళనుంచి ఆ ఊళ్ళో ఏ పెళ్ళి జరిగినా సంగడింట్లో వున్న పల్లకీలోనే పెళ్ళి ఊరేగింపు. సంగడి పదేళ్ళ వయసులో సంగడి తండ్రి, అశ్వంలా చుట్టాలు పల్లకీ మోస్తుండగా తను పక్కనే వుండేవాడు. పల్లకీకి రంగు రంగుల కుచ్చులు గలగలలాడే గాజుపూసలు..... పల్లకీ కొమ్ముకి పట్టు తురాయి. పారశీకాశ్వంలా వుండేది పెళ్ళి పల్లకీ. ఏనుగంబారీలా వుండేది పెళ్ళి పల్లకీ. అందులోకి వచ్చి కూర్చునేవారు కొత్త పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు. సంగడు చిన్నవాడవడంచేత

నెత్తిన గాస్ లైట్ పెట్టేవారు. ఆ లైటుతో పెళ్ళికొడుకు పెళ్ళికూతురు దగ్గర నుంచునేవాడు సంగడు. మధుపర్కాలు కట్టుకున్న పెళ్ళికొడుకు పెళ్ళి కూతుళ్ళ నుదుట బాసికాలు లైటు వెలుతురులో తళుక్కున మెరవగా, పెళ్ళి కూతురికి చిరుచెమటపట్టి కళ్యాణతిలకం కరిగిపోగా, బుగ్గనున్న చాదుచుక్క పెద్దదవగా ఆ దృశ్యాన్ని కళ్ళు విచ్చుకు చూసేవాడు సంగడు.

ఎవరూ చూడకుండా పెళ్ళికొడుకు పెళ్ళి కూతురు చెయ్యి గిల్లితే ఆ పిల్ల చిరుకోపంతో వారచూపులు చూస్తే కిసుక్కున నవ్వి "అమ్మదొంగ" అనుకునేవాడు సంగడు. అలా ఎన్ని పెళ్ళిళ్లు చూశాడో! ఎప్పటికైనా తనూ పెళ్ళి చేసుకుని వాళ్ళలాగే పల్లకీలో వూరేగాలని కలలు కనేవాడు.

సంగడికి వయసొచ్చింది. పల్లకీ ఊరేగింపు సంగతి దేవుడెరుగు కాని, అసలు పిల్లనిచ్చేవాడే దొరకలేదు. కానీ పరక లేనివాడికి, కాయకష్టంతో బతికేవాడికి పిల్లనెవరిస్తారు? కొంతకాలానికి ముసలి పెద్దలు గంతకుతగ్గ బొంతని ఏరుకొచ్చి గుళ్ళోకి తీసుకెళ్ళి తాళి కట్టమన్నారు. నాకు పల్లకీ వూరేగింపు కావాలన్నాడు సంగడు. ముసలాడెవడో నెత్తిన మొట్టి 'బాజాలు పల్లకీలు కావాలంట్రా! సేతులమ్ముకుని బతకండ్రా!' అంటూ గుడిసెలోకి తోశాడు.

సంగడు కొంతకాలానికి సుబ్బితో అనేవాడు "మనం ఇంత మందిని పల్లకీలో కూకోబెట్టి వూరేగింపు మోసేవాళ్ళం గదా! మనకా కోరిక తీరలేదే? మనకు పిల్లా జల్లా పుట్టినాక ఆళ్ళ పెళ్ళిళ్ళకు వూరేగుతారులేయె" అని.

సుబ్బి నవ్వుకుని "కానీ! దేవుడెట్లా రాసిండో!" అనేది. దేవుడు వాళ్ళు కోరుకున్నట్టు రాయలేదు. వాళ్ళకి పిల్లాజల్లా పుట్టలేదు. పెళ్ళిళ్ళు జరగలేదు. ఊరేగింపు సంబరాలు తీరలేదు. అంతకంటే అన్యాయం ఏమిటంటే పదేళ్ళబట్టి ఊళ్ళో ఏ పెళ్ళికి పల్లకీ పిలవడంలేదు. ఊరేగింపులకి-పూలపల్లకీలు, చిన్నకార్లు వచ్చాయి.

సంగడి పల్లకీ బూజుపట్టి పోయింది. దాంతో జీవనాధారం పోయింది.

అయితేనేం? సంగడికి ఆశ చావలేదు. ఎక్కడ పెళ్ళి జరిగినా "పల్లకీ ఊరేగింపు సెయ్యండయ్యా" అని సంగడెళ్ళి బతిమాలుకోవడం వాళ్ళు వద్దు పొమ్మంటే ఈసురోమంటూ ఇంటికి రావడం మామూలైంది.

దూరంగా పెళ్ళి సన్నాయితో పాటు తాషామర్పా కూడా మోగుతోంది.

పెళ్ళి పందిట్లోకెళ్ళి పెళ్ళి కూతురు తండ్రితో సంగడు గొప్ప ఆవేశంతో చెప్పాడు. "ఊరేగింపుకి పల్లకీ పెట్టించండయ్యా! మహాజోరుగా వుంటది! కుచ్చుల పల్లకీ! రాజా పల్లకీ! అచ్చొచ్చిన పల్లకీ! అద్దాల పల్లకీ! " పెళ్ళికూతురు తండ్రి మగపెళ్ళివారిని అడగమన్నాడు. సంగడు విడిదికెళ్ళి చెప్పడం మెదలెట్టాడు. "రాజులెక్కే పల్లకీ అయ్యా! రాణివాసం వెళ్ళే పల్లకీ అయ్యా! పట్టుకుచ్చుల పల్లకీ అయ్యా! పదిమంది మోసేపల్లకీ అయ్యా! పెళ్లికొడుకు తండ్రి విసుక్కుని పొమ్మన్నాడు. కడుపులో ఆకలి కమిలిపోతున్నా పెళ్లికొచ్చిన ప్రతీవాళ్ల దగ్గరకూ వెళ్లి. " ముత్యాల పల్లకీ అయ్యా! ముచ్చటైన పల్లకీ అయ్యా!" అంటూ పందిట్లో అందరికి చెప్పుకుంటున్నాడు. ఎవరూ వినిపించుకోలేదు. 'పల్లకీ! పల్లకీ!" అంటూ పందిట్లో తాటాకులకు, మామిడి తోరణాలకు, గుమ్మాల పసుపులకి, గాలిలో సన్నాయికి చెప్పుకున్నాడు. ఏవీ సమాధానం చెప్పలేదు.

సంగడికి కళ్ళనీళ్ళు కారిపోతున్నాయి. ఆకలి పేగుల నమిలేస్తోంది. "పల్లకీ పల్లకీ" అని గొణుక్కుంటూ దుమ్ములో కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకొచ్చి కూలబడ్డాడు. ఎదురుగుండా పల్లకీ బొంగు సొంతం కనిపించలేదు. వెళ్ళి చూద్దామంటే ఓపిక లేక అలాగే కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. సొమ్మసిల్లి పడిపోయిన సంగడికి సుబ్బి గంజి చిప్ప అందించింది. కళ్ళు తెరిచి నూతిలోంచి అడుగుతూన్నట్లు "ఎక్కడిదే గంజి" అన్నాడు.

"పాములమ్మి తానడుక్కొచ్చిన నూకల్లో కాసినప్పిచ్చింది" అంది.

"గంజిలో ఉప్పులేదు!"

"ఉప్పెక్కడిది? గంజి కాయడానికే పుల్లల్లేక ఆ పుచ్చిపోయిన పల్లకీ బొంగు విరిసి మంటబెట్టినా."

సంగడి గుండె ఏడ్చింది. కళ్ళు ఏడ్చాయి. ఎదురుగా విరిగిన పల్లకీ.

చేతిలో ఉప్పులేని గంజి.*